RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 211 | జులై 18, 2025 | వెల : రూ.3-00



## ఉస్మానియా యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక అవార్డు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

పునరుత్పాదక విద్యలో ఉస్మానియా యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక ఏసీఈ అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ కౌన్సిల్ 4లో..

# ప్రమాదకరంగా హోర్డింగ్స్..!





- పట్టించుకునే వారే లేరా?
- గాలిలో దీపంలా ప్రజల భద్రత
- ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పొంచిన ముప్పు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

బల్దియాకు ఆదాయాన్ని సమకూర్చే హోర్డింగ్స్ ఇప్పుడు ప్రమాదకరంగా మారాయి. వరంగల్ నగర పరిధిలోని పలుచోట్ల హోర్డింగ్స్ కనీసం మెయింటెనెన్స్ లేక వేలాడుతున్నట్టుగా ఉన్నాయి. రోడ్డు కిరువైపులా జాగా తమదే అన్నట్టుగా కొన్నిచోట్ల హోర్డింగ్స్ ప్రమాదకరంగా వెలిసి ఉన్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో విపరీతమైన గాలులు, వర్ష ప్రభావం వల్ల అవి ఎప్పుడైనా ఊడిపోయి ప్రజలపై పడే ప్రమాదం ఉందని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకునే వారు ఏరి?**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హోర్డింగ్స్‌ను నిర్వాహకులు కనీసం గా పట్టించుకోవడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇనుప చువ్వలకు, బిల్డింగ్స్ పైన, జన సమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతాల్లో పెను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా కనిపిస్తున్నాయా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ లను.. మున్సిపల్ కార్పొరేషన్.. ఆదాయ మార్గంగా చూడకూడదని, ఒకవేళ అలా చూసిన క్రమ పద్ధతిలోనే వాటిని ఏర్పాటు చేసుకునేలా మార్గదర్శకాలు కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే.. ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ప్రజలపై కూలి.. వారి ప్రాణాలకు ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు దీనిపై స్పందించాలని కోరుతున్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వెంటనే ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్స్‌ను తొలగించాలని జనం కోరుతున్నారు.





## రైల్వే జీఎంని కలిసిన ఎమ్మెల్యే నాయిని

**వేద న్యూస్, హన్మకొండ:**

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌గా నూతనంగా నియమితులై గురువారం కాజీపేటకు విచ్చేసిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్‌ని కాజీపేట రైల్వే స్టేషన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్‌లు శాలువాతో సత్కరించి నూతన జీఎంకి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కి రోడ్డు మార్గం కాజీపేట మీదుగా ఉన్నదని కాజీపేటలో బస్ స్టాండ్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గతంలోనె రైల్వే శాఖకు కాజీపేట రైల్వే స్టేడియం లో ఉన్న స్థలాన్ని మంజూరు చేయాలని కోరడం జరిగిందని బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థల కేటాయింపు ప్రక్రియ సానుకూల దృక్పథంలో వేగవంతం చేయాలని లేక ద్వార పేర్కొన్నారు.కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ,ఉపాధి రంగాల్లో 50శాతం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.గతంలో ఆగిపోయిన రైళ్లను పునః ప్రారంభించి కాజీపేటలో హాల్టింగ్ కల్పించాలని కోరారు.రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.జంట నగరాలుగా ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,విజయశ్రీ రజాలి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంకుస్,నాయకులు మనోహర్,రమేష్ పాల్గొన్నారు.



## నీళ్ల కోసం రైతులు ధర్నా..!

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండలం పొత్తూరు బ్రిడ్జిపై రైతులు నిర్వహించిన ధర్నా రాస్తారోకోకి రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సిద్ధం వేణు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని,దుక్కి దున్ని పొలాలు సిద్ధం చేసి పెట్టారని, కానీ వర్షాలు లేక కాలువల ద్వారా నీళ్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, మధ్యమనేరు కుడి కాలువ,వాగు ద్వారా నీటిని విడుదల చేసి సుమారుగా 15000 ఎకరాలకు తక్షణమే అందజేయాలని కోరారు.తమ ప్రభుత్వ హయాంలో రైతులు నీళ్ల కోసం ఆలోచన చేసిన వెంటనే వాళ్ళు కోరిన విధంగా నీటిని విడుదల చేశామని అన్నారు.ప్రభుత్వం కాళేశ్వరం నీటిని అందజేసే అవకాశం ఉన్న కుట్రపూరితంగా వ్యవహారిస్తుంది అన్నారు. ఈ విషయంపై మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే స్పందించి నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు రెండు రోజులలోగా నీటిని అందజేయాలని డిమాండ్ చేసారు.లేని పక్షంలో రైతుల ఆధ్వర్యంలో మిడ్ మానేరు ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పొత్తూరు, కట్కూర్, వల్లంపట్ల, ఓగులాపూర్, నర్సక్కపేట, రంగంపేట, వంతడుపుల, గాలిపల్లి, జవారిపేట, తాళ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొని వారు మాట్లాడుతూ.మధ్యమానేరు జలాశయం కుడి కాలువ ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని,రెండు రోజులలోపు కుడి కాలువ ద్వారా మరియు వాగు ద్వారా నీళ్లు విడుదల చేయకపోతే రైతులం అందరం కలిసి మధ్యమానేరు ముట్టడించి గేట్లు బద్దలు కొట్టి మేమే నీటిని వదులుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కూలిన కూరగాయల బతుకమ్మ..!

**వేద న్యూస్, ములుగు జిల్లా**




ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో గురువారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి వేడుకలలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు మంత్రి సీతక్కకు స్వాగతం పలికేందుకు వినూత్నంగా కూరగాయలతో బతుకమ్మలను పేర్చారు. అన్ని రకాల కూరగాయలతో కూడిన ఓ బతుకమ్మను మంత్రి సీతక్క తన తలపై పెట్టుకుని ముందుకు నడవసాగింది. అంతలోనే ఉన్నట్టుండి.. ఆ కూరగాయల బతుకమ్మ కూలిపోయింది. దీంతో మిగతా 4వ పేజీలో..

## కేటీఆర్ మిత్రుడు దుబాయ్‌లో చనిపోయాడు?

**వేద న్యూస్, ఢిల్లీ :**



సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఢిల్లీలో మీడి యాతో చిట్ చాట్ నిర్వహించారు సీఎం. ఈ చిట్‌చాట్‌లో కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీపై సంచలన మిగతా 4వ పేజీలో..



# 'ఏజే' @ 'బెల్ట్ అడ్డా!?

- మిల్స్ కాలనీ పీఎస్ పరిధి బెల్ట్ షాపులకు అడ్డా
- గల్లీకో దుకాణం.. సెంచరీ దాటిన సంఖ్య!
- విచ్చలవిడిగా అమ్మకాలు.. లైట్ తీసుకుంటున్న అధికారులు
- 'మామూళ్ల' చెల్లింపులతో ఎక్సయిజ్, స్థానిక ఆఫీసర్ల 'మామూలు' తనిఖీలు!
- ఫిర్యాదులొస్తే సమాచారమిచ్చి మరీ ఉదాసీన వైఖరితో నామమాత్రపు సోదాలు!
- మూడు పెగ్గులు.. ఆరు క్వార్టర్లు కాదు అంతకు మించిన రీతిలో మద్యం వ్యాపారం

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి బెల్ట్ షాపులకు అడ్డాగా మారింది.! స్టేషన్‌కి కూతవేటు దూరంలోనే బెల్టు షాపులను కొందరు దర్జాగా నడుపుతున్నారు. నిత్యం 24 గంటల పాటు మద్యం విక్రయించే బెల్టు షాపుల వైపు ఎక్సయిజ్ శాఖ, స్థానిక పోలీసులు కనీసంగా దృష్టి పెట్టకపోవడం ఉదాసీన వైఖరి కనబరుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది..

**తరచూ మందుబాబుల హంగామా..!**

బెల్టు షాపుల నిర్వాహకుల ఆగడాలకు అడ్డూ అదుపూ మాత్రమే కాదు హద్దు కూడా లేకుండా పోతోంది. రాత్రి 10 గంటలు మొదలు తెల్లారే వరకు మందుబాబులు హంగామా చేస్తుంటారు. దీని వల్ల స్థానికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. అదేమని స్థానికులు అడిగితే ఇక అంతే సంగతులు.. బెల్టు దుకాణం నడిపే వారు స్థానికులను దుర్భాషలాడుతూ దాడికి దిగుతారు. వాళ్ల భయానికి స్థానికులు బయటికి రావటానికి జంకుతున్నారంటే అక్కడ ఎలాంటి పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

**గల్లీకో బెల్ట్ షాప్.. విచ్చలవిడిగా అమ్మకాలు**

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 100కు పైగా బెల్ట్ షాపులు ఉన్నట్టు సమాచారం. అందులో ముఖ్యంగా నిత్యం ఏదో ఒక గొడవ జరిగే బెల్ట్ షాప్ చూసుకుంటే శాకరాసికుంట, కరీమాబాద్ ప్రాంతాలలో ఏదో ఒక్క గొడవ జరుగుతూనే ఉంటుంది. ఇక పోతే కరీమాబాద్ కరెంట్ ఆఫీస్ ప్రాంతం, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సు తాళ్లు, లక్ష్మీ నగర్, కళింగ బార్ పక్క గల్లీ, అమ్మవారిపేట ప్రాంతంలో రెండు, బీఆర్ నగర్‌లో రెండు, ఖిలా వరంగల్ మూడు కోటలు కలిపి సుమారు 80కి పైగా ప్రాంతాల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా నడుస్తోంది. మూడు పెగ్గులు.. ఆరు క్వార్టర్లే కాదు అంతకు మించి అనే రీతిలో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు..?**

వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్టు షాపులు 24 గంటల పాటు దందా సాగిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎక్సయిజ్ శాఖ, లోకల్ పోలీస్ ఆఫీసర్లు మామూళ్లకు అలవాటుపడి తనిఖీల ఊసే ఎత్తడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోనే బెల్టు షాపుల నిర్వాహకులు దర్జాగా దందా సాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. బెల్టుషాపులతో ఇబ్బందులు పడుతున్నట్టు ఎవరైనా లోకల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. తనిఖీలకు వస్తున్నట్టుగా ముందస్తుగా సమాచారం ఇచ్చి నామమాత్రంగా సోదాలకు వెళ్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. 24 గంటల పాటు మద్యం లభిస్తుండటం అనర్థాలకు దారి తీస్తుండగా..కట్టడి చేయాల్సిన అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. బెల్టుషాపులపై ఫోకస్ పెట్టి, మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్

శుక్రవారం జులై 18, 2025

# అవినీతిపై విచారణ జరిపించాలి




**వేద న్యూస్,కరీంనగర్ :**

కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని, మాజీ మేయర్ సునీల్ రావు అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు విచారణ చేయాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో కోట్ల రూపాయల నిధులతో జరిగిన స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని దీనిని పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మేయర్ సునీల్ రావు కొందరు బినామీ కాంట్రాక్టర్లను ఏర్పరచుకొని ఇష్టం వచ్చిన రీతిలో స్మార్ట్ సిటీ పనులలో అవినీతి అక్రమాలు ప్రోత్సహించాడని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్ పాతుల నిర్మాణం,జంక్షన్ల సుందరీకరణ, పార్కుల నిర్మాణం,రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలలో పూర్తిగా అవినీతి అక్రమాలు జరగాయని అధికారులు రాజకీయ నాయకులు ఒక్కటై కరీంనగర్ నగరాన్ని దోచుకున్నారని విమర్శించారు. సంవత్సరం కాకముందే ఫుట్ పాతుల టైల్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు పగళ్ళు వచ్చాయని కాంట్రాక్టర్ పూర్తిగా నాణ్యత పాటించకపోవడం కాంట్రాక్టర్‌కి వత్తాసు పలకడం వల్ల అవినీతి రాజ్యమేలిందని వెంటనే స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతి పై విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి వరకు మేయర్‌గా కొనసాగిన సునీల్ రావు స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని మేయర్ పదవి పోయిన తర్వాత గుర్తుకు రావడం సిగ్గుచేటని సునీల్ రావు మాటలు వింటుంటే దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరించడం సరైంది కాదని ఆరోపించారు. సునీల్ రావుకు కరీంనగర్ నగరంలో బహుళ అంతస్తుల భవనం, విదేశాల్లో భవంతులుఏ విధంగా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. సునీల్ రావుకు చిత్తశుద్ధి ఉంటే తను కౌన్సిలర్ గా గా పోటీ చేసిన సమయంలో ఎన్నికల అపిడవిట్లో పెట్టిన ఆస్తుల వివరాలు ఇప్పుడు తన ఆస్తుల వివరాలు ప్రజలకు వివరించి తన చిత్త శుద్ధి నిరూపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతి, సునీల్ రావు అక్రమాలపై విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టి అంజలి, మచ్చ రమేష్, ఆర్ వెంకటేష్ నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం,కె. సంతోష్ చారి, చంచల మురళి,నగునూరి రమేష్, ఎలిశెట్టి భారతి,చారి, రాము, సాంబ రాజు,బెక్కంటి రమేష్, లక్ష్మీ,రజిత, సుజాత, రమ, సందీప్. రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.



## నిబంధనల ప్రకారం ఎరువులు..

# విత్తనాలు విక్రయించాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, చందుర్తి :**

నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తి మండలంలోని మరిగడ్డ శ్రీ పవన కుమార ఫెర్టిలైజర్ దుకాణం, చందుర్తి మండల కేంద్రం, సనుగుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలుదుకాణాల్లో నిలువలు పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని యజమానులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# ఎంపీ నిధులతో బోరు ఏర్పాటు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో రోడ్ నెంబర్ 8లో నీటి కొరత ఉండేది. విషయాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి ఎంపీ నిధుల నుండి బోరు ఏర్పాటు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా అన్నారు. టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి కి సంబంధించిన చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ప్రజాభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నదని ముఖ్యమంత్రి సహాయనిధితో ప్రభుత్వం ప్రజలను ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం ఆర్ ఎఫ్ ద్వారా అందజేయడం జరుగుతుందని అని కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ మాజీ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు కోరే రాజకుమార్, ముద్దం ప్రశాంత్, మజ్జు, సమీర్, సర్కార్ షోయబ్, తోపిక్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**- ఎస్సై అశోక్**

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరిగింది. వాహనాలకు నెంబర్ ప్లేట్లు,సంబంధించిన పత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని కూడా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని,నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డుపై తిరిగినట్లు కనిపిస్తే వాటిని సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వాహనాలను నడపాలని, ఆయన సూచించారు. తల్లిదండ్రులు ఎవరైనా బాధ్యత రహితంగా మైనరు పిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే,తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన జనరల్ మేనేజర్ శ్రీ వాత్సవ

**వేద న్యూస్, మడికొండ :**



తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వేకు నూతనంగా విచ్చేసిన జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ గురువారం కాజీపేటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైల్వే జేఏసీ తరఫున వినతి పత్రంలో కాజీపేట రైల్వే జంక్షన్లో రైల్వే సమస్యల పైన, నూతనంగా ఏర్పాటు అవుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు, వరంగల్ ఉమ్మడి జిల్లా వాస్తవ్యులకు, తెలంగాణ రాష్ట్ర ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గతంలో సౌత్ సెంట్ర ల్ రైల్వేలో ఆరు డివిజ న్లు ఉన్నప్పటికీ కాజీపేట సబ్ డివిజన్ నుండి 42.8 శాతం లాభాలను గడిచి సౌత్ సెంట్రల్ రైల్వే అత్యధిక లాభాలను కలుగ చేస్తున్నటువంటి కాజీపేట సబ్ డివిజన్‌ను కాజీపేట డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, సౌత్ సెంట్రల్ రైల్వేలో నుండి విజయవాడ, గుంటూరు, గుంతకల్ మూడు డివిజన్లు నూతనంగా ఏర్పాటు చేసినటువంటి సౌత్ కోస్ట్ రైల్వేలోకి వెళ్లిపోవడం వలన గతంలో గుంటూ రు డివిజన్లో ఉన్న నల్గొండ ప్రాంతం జాన్ పాడు నుండి పగిడిపల్లి వరకు 164 కిలోమీటర్లు సికింద్రాబాద్ డివిజన్లోకి చేర్చడం జరిగింది. అదేవిధంగా రాయచూర్ ప్రాంతం నుండి196 కిలోమీటర్లు సికింద్రాబాద్ డివిజన్లో చేర్చడం వలన సౌత్ సెంట్రల్ రైల్వే లోనే అతి పెద్ద విస్తరణ, అతి ఎక్కువ కిలోమీటర్లు కలిగిన డివిజన్ గా ఏర్పాటు జరిగిందనీ, కావున అధికారికంగా పరిపాలన విధానం రైల్వే అధికారులకు అధిక భారం పడుతున్నందుకు సగ భాగాన్ని విభజించి కాజీపేట రైల్వే జంక్షన్ ను కాజీపేట డివిజన్ గా ఏర్పాటు చేయాలని, తెలంగాణ ప్రజల 30 సంవత్సరాల ఆకాంక్షను నెరవేర్చాలని, అదేవిధంగా గత 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసినటువంటి కాజీపేట టౌన్ స్టేషన్‌ను ట్రయాంగి రైల్వేస్టేషన్ గా నిర్మాణం చేయాలని, కాజీపేట జంక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నటువంటి లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, ట్రైన్ మేనేజర్‌లకు పదోన్నతులు పొందిన తర్వాత కాజీపేట లోనే తిరిగి అవకాశం ఇవ్వకుండా విజయవాడకు పోస్టింగులు ఇవ్వడం మానుకోవాలని, ఇక్కడ అధిక భారంతోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న లోకో పైలెట్స్, అసిస్టెంట్ లోకో పైలెట్స్, ట్రైన్ మేనేజర్లను బదిలీ చేయడం వలన ఉన్నవారిపై ఇంకా అధిక భారం పడుతుందని అలాంటి వాటికి స్వస్తి చెప్పి తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ రైల్వే జేఏసీ తరఫున సూచించామన్నారు. 2019 సంవత్సరంలో మొదటిసారిగా కోవిడ్ రావడం వలన 2020 సంవత్సరంలో రద్దు చేయబడిన మణుగూరు నుండి కొల్లాపూర్ 11303, 11304 ఎక్స్ప్రెస్ ను పునరుద్ధరించాలని, కాజీపేటలో ఆగకుండా వెళ్తున్నటువంటి 16 ఎక్స్ప్రెస్ రైళ్లను అధికారికంగా నిలిపాలని వినతి పత్రంలో కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, కో కన్వీనర్ పి.రమేష్, విద్యాసాగర్, వైస్ చైర్మన్ జి భాస్కర్, యాదగిరి, ఎస్ లక్ష్మీనారాయణ, సాయి రాజు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు

# త్వరితగతిన పూర్తి చేసుకోవాలి



**వేద న్యూస్, చందుర్తి:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని.. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. చందుర్తి మండలంలోని రామారావు పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా తిరగడం గమనించిన కలెక్టర్. వాటిని నియంత్రించాలని పంచాయతీ సెక్రెటరీ అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్య పనులు నిర్వహించాలీసనుగుల గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల వెంట ఇరువైపులా గడ్డి, నిరుపయోగ మొక్కలు పెరగడం,రహదారి వెంబడి వర్షపు నీరు ఉండడాన్ని కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల వెంట గడ్డి, ఇతర మొక్కలు వెంటనే తొలగించాలని,నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్య పనులు చేయించాలని, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తాళం వేసి ఉన్న రెండు


# ఇళ్లలో చోరీ



**వేద న్యూస్, మానకొండూర్ :**

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు చొరబడి బంగారం,నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గంగిపల్లి గ్రామానికి చెందిననూనె. కొమురయ్య,బండ రవీందర్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తుల ఇళ్లలో చోరి జరిగింది. ఇటీవల నూనె కొమురయ్య భార్య కొమురమ్మ మరణించింది. భార్య మరణించిన అనంతరం అతని కుటుంబ సభ్యులు ఇళ్ళు వదిలిపెట్టి గంగిపల్లి పక్క గ్రామం చెంజర్లలో కిరాయికి ఉంటున్నారు. కొమురయ్య ఇంటికి తాళం వేసి ఉంది. అదే అదునుగా భావించిన దొంగలు కొమురయ్య ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి రూ.2 లక్షల నగదు,5 తులాల బంగారం,15 తులాల వెండి దొంగిలించారు. గంగిపల్లి గ్రామానికి చెందిన బండ రవీందర్ రెడ్డి ఇంటికి తాళం వేసి అతని కుమారుని దగ్గరకు వెళ్లారు. అతని ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి అర్ధతులం బంగారం,వెండి పూజపాత్రను ఎత్తుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందడంతో సిఐ బి. సంజీవ్,ఎస్ఐ కె.స్వాతి,ఫింగర్ ప్రింట్ పోలీసులు,డాగ్ స్క్వాడ్ పోలీసు జాగిలం)తో గురువారం గంగిపల్లికి చేరుకొని చోరి జరిగిన ఇళ్లను పరిశీలించారు. పోలీసు జాగిలంతో గ్రామంలో తనిఖీలు చేశారు. ఎస్ఐ స్వాతి బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. చోరి జరిగిన ఇళ్లలో ఫింగర్ ప్రింట్ పోలీసులు వేలి ముద్రలు సేకరించారు. సిఐ సంజీవ్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

# పరామర్శ



**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలో ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత గౌరోజు అశోక్ ఇటీవల ఆరోగ్యం విసమించటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టు వంగాల వెంకటేష్ అశోక్ ను పరామర్శించి,మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు నార్ల అజయ్, బచ్చు వెంకన్న, దామెర్ల దేవయ్య, నర్సింగోజు ఆచారి ఉన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని

**వేద న్యూస్, కాజీపేట :**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గురువారం 47వ డివిజన్ భవానీ నగర్ లో 30 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి శంకుస్థాపన చేసి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, పార్టీలకు అతీతంగా అన్ని డివిజన్‌లలో నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, 47వ డివిజన్ అధ్యక్షులు అస్గర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైసరపు సిరిల్ లారెన్స్, బబ్లూ, బిలాల్, సిల్వేరు విజయ్ భాస్కర్, మానస, మధు, దువ్వ రాజులు, తిరుపతి, శ్రీనివాస్, ఇప్ప శ్రీకాంత్, పోగుల శ్రీనివాస్, బర్ల రాజ్ కుమార్, శోభన బోయిన బిక్షపతి, దార్ల రాజ్ కుమార్, మాతంగి స్వామి, సిల్వేరు మల్లికార్జున్ ఇమ్మడి రవి గబ్బెడ ఎల్లేష్, మాలతి, గోవర్ధన్, భవాని నగర్ కాలనీ సభ్యులు ఎడ్ల భూపాల్ రెడ్డి, లస్కర్ ఈశ్వర్, వీరస్వామి, రవీందర్ రెడ్డి, రాజు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




## విద్యాసంస్థల బంద్
# జయప్రదం చేయండి

- వామపక్ష విద్యార్థి సంఘాలు

**వేద న్యూస్, హన్మకొండ :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని,రాష్ట్రంలో విద్యాశాఖ కు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్న ట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం వామపక్ష విద్యార్థి సంఘాలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈనెల 23న నిర్వహించబోయే బందు కార్యక్రమాన్ని విజయవంత చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర కన్వీనర్ మా సావిత్రి , (పి డి ఎస్ యు) జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష ,(ఏఐఎస్బి) హనుమకొండ జిల్లా కన్వీనర్ రోహిత్ లు పాల్గొన్నారు.

# వానరానికి అంత్యక్రియలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించి ఓ యువకుడు తన ఉదారతను చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కు వెళ్లే దారిలో గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వానరం మృతి చెందింది. అదే సమయానికి అటుగా వెళ్తున్న శంభునిపేట ప్రాంతానికి చెందిన జడల రాము మృతి చెందిన వానరాన్ని చూసి చలించి పోయాడు. వెంటనే వానరానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు అదే ప్రాంతానికి కొండయ్య, సంజీవ్ ల సహాయంతో మంగళమ్మ కుంట చెరువు ప్రాంతంలో గొయ్యి తీసి వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు చేసిన రాము ను పలువురు అభినందించారు.

## తెలంగాణలో నాలుగు రోజులు
# భారీ వర్షాలు..



**వేద న్యూస్, హైదరాబాద్**

కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. శుక్రవారం నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట,హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేద న్యూస్, వేములవాడ :**




మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మహిళలు ఆర్థిక అభివృద్ధి తోనే దేశ ప్రగతి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో డిఆర్డిఏ, షేర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.మహిళల సమైక్య సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజి, ఇటీవల మరణించిన మహిళా సంఘ సభ్యుల ప్రమాద బీమా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీట వేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో వైఎస్ పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేశారని, ఐకేపీ కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సాహం అందించాలని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల జమ చేశామని అన్నారు. రైతు భరోసా క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల జమ చేశామని తెలిపారు. రైతు బీమాకు 3వేల కోట్ల అందించామని అన్నారు. మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వర్ తీసుకున్న రుణం మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. లోన్ బీమా,ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని అన్నారు. ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గంలో 37 మందికి 40.43 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికీ ఆశీర్వాదాలు అందజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శేషాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, కచకాయల ఎల్లయ్య,అన్ని మండల ఏపీఎంలు, మహిళా సమైక్య సంఘ అధ్యక్షురాలు,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జూనియర్ కాలేజ్‌ను సందర్శించిన అధికారులు



**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ భీమ్ సింగ్, డిఐఈవో దస్రు నాయక్‌లు సందర్శించారు. ఈ సందర్భ ంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ వారి విలువైన సూచనలు ఇస్తూ, బోధన సిబ్బందికి మార్గదర్శకత్వం ఇచ్చారు.సప్లమెంటరీ పాసైన విద్యార్థులను కాంటాక్ట్ చేయడం ద్వారా అడ్మిషన్లను మెరుగుపరుచుకోవాలని,గత సంవత్సరాల డ్రాప్ అవుట్లపై కూడా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.విద్యాశాఖ కమిషనర్ ఇంటర్మీడి యట్ విద్యార్థులకు పూర్తి సౌకర్యాలను కల్పిస్తూ వాటికి అవసరమైన నిధులను గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున విడుదల చేసినట్లు తెలిపారు.ఈ అవకాశా లను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి విద్యార్థి కాలేజీకి క్రమం తప్పకుండా హాజరవుతూ ఉపాధ్యాయులు బోధించే విద్యను శ్రద్ధగా విని ఉన్నత విద్య ఉద్యోగాలను పొందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కాలేజీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నాదని ఉచిత పాఠ్య పుస్తకా లను కూడా పంపిణీ చేసిందని అన్నారు.ఈ సంవత్సరం ఆట పరికరాలకు రిపేరింగ్ లకు మౌలిక వసతుల కల్పనకు గ్రాంట్ లను విడుదల చేసిందని,విద్యార్థులు ప్రతి శనివారం ఆటలు ఆడుకోవడానికి ఆట వస్తువుల కూడా నిధులు జారి చేసిందని పేర్కొన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ కళాశాలలో ఫిజిక్స్ వాల ఆన్లైన్ క్లాసులను ఉచితంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసిం దని ఆయన తెలిపారు.అలాగే సుదీర్ఘ అనుభవం కలిగిన లెక్చరర్స్ అందుబాటులో ఉన్నారని,అన్ని గ్రూపులకు లెక్చరర్స్ రిక్రూట్మెంట్ పూర్తిగా జరిగిందని ఆయన అన్నారు.లెక్చరర్స్ చేస్తున్న కృషికి ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు ఈనెల చివరి వరకు అడ్మిషన్ల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఇంకా లెక్చరర్స్ అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబె ట్టాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ రేపాల శ్రీనివాస్,లెక్చరర్స్ అజ్మీర్ రెడ్డి,జ్యోత్స్న, కృష్ణకుమారి,ప్రవీణ్ కుమార్,సత్యనారాయణ రెడ్డి,టి. అరిస్టాటిల్,మధు,నాగరాజు,వరలక్ష్మి,సల్మా,జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర :**

గంగాధర మండలం కురిక్యాల శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయో త్సవ సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ క్రింద 328 మహిళ సంఘాలకు రూ. 38.20 కోట్లు, 5273 ఇలా సంఘాలకు రూ. 6.92 కోట్లు, ఆరుగురు సభ్యులకు ప్రమాద బీమా క్రింద రూ.60 లక్షలు, 54 మంది సభ్యులకు లోన్ బీమా క్రింద రూ. 48.52 కోట్లు. స్టిచ్చింగ్ స్కూల్ యూనిఫామ్ కు రూ. 20.83 లక్షలు. ఐదు మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు రూల్. 1.54 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. మహిళలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఐకెపి సెంటర్లు ఇలా ఏ అవకాశం ఇచ్చిన అద్భుతంగా చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. దేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలే కేంద్రంగా ప్రభుత్వం పథకాల రూపకల్పన చేస్తుంది. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సిలిండర్ ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాము. ఈ ఏడాది అర్హులైన కొంతమందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేశాము. రానున్న మూడున్నర ఏళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కట్టిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజా ప్రభుత్వం మరింత ఉత్సాహంగా పనిచేయడానికి లోని మహిళా సోదరీమణులంతా సంపూర్ణ సాకారం అందజేయాలి. ఈ కార్యక్రమంలో చొప్పదండి, గంగాధర, రామడుగు, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు కొత్తూరు మహేష్, జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, బొమ్మరవేణి తిరుమల తిరుపతి, బోయిని ఎల్లేష్, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌కు తప్పిన ప్రమాదం..

**వేద న్యూస్, మెదక్:**

రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి పెను ప్రమాదం తప్పింది. మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో ఆయన కాన్వాయ్ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ముందు వెళ్తున్న ఓ కారు సడెన్ బ్రేక్ వేయడంతో 4 కార్లు ఒకదానికొకటి ఢీ కొట్టాయని, దీంతో కార్ల ముందు భాగం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అధికారులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.కాగా, ప్రమాదానికి ముందు ఆయన నర్సాపూర్‌లో పర్యటించారు. అర్హులందరికీ కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డులను మంత్రి వివేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక మహిళ ఆర్థికంగా నిలబడితేనే కుటుంబం బాగుంటుందన్నారు. అలాగే, విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టిందని వెల్లడించారు.




## సీఎం ఎవరికి భయ
# పడుతున్నాడు..!

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ వాదులు భయపడుతున్నదే నిజం అవుతున్నదని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఏపీకి దారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ ఏ నీళ్ల కోసమైతే పోరాడారో ఆ నీళ్లను రేవంత్ రెడ్డి ఏపీకి కట్టబెడుతున్నారని మండిపడ్డారు. మన నదులు మనకు కాకుండా చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. ముందు ఢిల్లీకి వెళ్లేది లేదన్న రేవంత్ రెడ్డి.. అక్కడి నుంచి వచ్చిన ఒక్క ఫోన్ కాల్‌తో హుటాహుటిన పయణమయ్యాడని విమర్శించారు. హోటల్లో ఉండి రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నాడని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, గాదరి కిషోర్ కుమార్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ మీటింగ్‌కు సంబంధించి ఓ పత్రిక తెలంగాణలో ఒకలా, ఏపీలో మరోలా హెడ్ లైన్ పెట్టిందన్నారు. జలవివాదాలపై కమిటీ అని తెలంగాణలో, గోదావరి-బనకచర్లపై కమిటీ అని ఏపీ ఎడిషన్‌లో పెట్టారని చెప్పారు. తెలంగాణకు చేస్తున్న ద్రోహమేమిటో తెలుసుకోవడానికి ఇదొక్కటి చాలన్నారు. 'రేవంత్ తెలంగాణ ప్రజలకు మోసం చేస్తున్నాడో, చంద్రబాబు ఏపీ ప్రజలకు ద్రోహం చేస్తున్నాడా ఈ వార్తపై చర్చతో తేలిపోవాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై బూతులు కాదు.. కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై మాట్లాడాలి. తెలంగాణ సోయి, తెలంగాణ ఆత్మలేని వాళ్ల పాలన నడుస్తోందని తాము మొదట్నుంచి చెబుతున్నది నిజమైంది. సీఎం ఎవరికి భయ పడుతున్నాడు, ఎందుకు భయపడుతున్నాడో?. ఒక్క ఫోన్ కాల్‌కు భయపడుతాడా? . తెలంగాణ ప్రజలు రేవంత్‌కు అధికారం ఇచ్చింది చీకటి ఒప్పందాలు చేసుకోవడానికా?. బనకచర్లపై ఇంత పచ్చి అబద్ధం మాట్లాడిన రేవంత్‌కు సీఎం పదవిలో కొనసాగే అర్హత లేదు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌కు డిమాండ్ చేయకుండా నిన్నటి మీటింగ్‌కు సీఎం ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?. నీ ఒక్కడి పదవి కోసం కోట్లాది ప్రజల హక్కులను బలి పెడతావా?. ఎందుకు భయపడుతున్నావ్ రేవంత్ రెడ్డి, మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తుందని భయపడ్తున్నావా?. తన తప్పు కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి మళ్లీ కేటీఆర్‌కు నోటీసు ఇచ్చి డైవెర్షన్ రాజకీయాలకు తెర తీసే అవకాశముంది. సీఎం చేసిన ద్రోహానికి తెలంగాణ వాదుల రక్తం మరిగిపోతోంది. వెనుకటి కాలంలో రాజులు ద్రోహులుగా ఉండే వారు. స్వతంత్ర పోరాటంలో కూడా ద్రోహం చేసిన వారు ఉన్నారు. ఇప్పుడు తెలంగాణకు రెండో ముఖ్యమంత్రి అయ్యి ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. మీడియా రూపాలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. గోదావరి నదిని ఏపీకి తాకట్టు పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి. కాళేశ్వరం, మేడిగడ్డ దగ్గర పంపులు ఆన్ చేయకుండా గోదావరి జలాలను కిందకు వదిలే కుట్రను రేవంత్ ఇప్పటికే విజయవంతంగా అమలు చేస్తున్నారు. చంద్రబాబుకు వంత పాడుతూ బీజేపీ నేతలు తెలంగాణకు ద్రోహం చేస్తున్నారు.బాధ్యత కలిగిన నాయకులు ప్రతి అక్షరాన్ని జాగ్రత్తగా వాడాలి. జ్ఞానం లేని వాళ్లే గోదావరిపై హక్కులు ఏపీకి కట్టబెట్టే విధానాన్ని సమర్థిస్తూ మాట్లాడుతారు. చంద్రబాబు సహాయకులు రాసిచ్చిన స్క్రిప్టును రేవంత్ చదువుతున్నారు. రేవంత్ గురువులు మోదీ, చంద్రబాబు. వారు చెప్పినట్టు నడుచుకుంటున్నారు. ఏడాదిలో రాహుల్‌ను కలవలేదు కానీ, వారిద్దరిని రేవంత్ ఎన్నో సార్లు కలుస్తున్నారు. రాయలసీమకు నీళ్లిచ్చే ప్రణాళికను కేసీఆర్ చెప్పినట్టు ఇప్పటికీ అమలు చేయవచ్చు. రేవంత్ తీరు దొంగే దొంగ అని అరిచినట్టు ఉంది. రాహుల్ గాంధీకి మూటలు పంపినా మాకు అభ్యంతరం లేదు. కానీ నీళ్ల విషయంలో రేవంత్ తెలంగాణకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం' అని జగదీష్ రెడ్డి హెచ్చరించారు.

వేద న్యూస్



## వంగిన 'కమాన్'

# కనిపిస్తలేదా?

- ఓవైపు వంగి ప్రమాదకరంగా.. సమ్మక్క సారలమ్మ జాతర కమాన్
- కమలాపూర్ పంగిడిపల్లి క్రాస్ వద్ద..
- పట్టించుకునే నాథుడు లేడా?



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా పంగిడిపల్లి క్రాస్ రోడ్ వద్ద 2012లో కీ.శే. ఇంజపూరి కనకలక్ష్మి కొమురయ్య ల జ్ఞాపకార్థం వారి కుమారులు ఇంజపూరి పోశం, ఇంజపూరి శంకర్‌లు సమ్మక్క సారలమ్మ జాతరకు సంబం ధించిన ఒక కమాన్ ఏర్పాటు చేశారు. ఈ కమాన్ ని అప్పటి హుజురాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభిం పజేసి.. సమ్మక్క సారలమ్మ దేవస్థాన కమిటీకి అప్ప చెప్పారు.

**చొరవ చూపి చర్యలు తీసుకోవాలని రిక్వెస్ట్**

నాటి నుంచి చాలా సంవత్సరాలు ఆ కమాన్ బాగానే ఉంది. దాని వలన ఎటువంటి సమస్య తలెత్తలేదు. కానీ ఈ మధ్యనే కొన్ని భారీ వాహనాలు ఆ కమాన్ ని ఢీకొట్టడం వలన కమాన్ మొత్తం ముందు వైపుకు అంటే హుజురాబాద్ - పరకాల హైవే రోడ్డు వైపు వంగి ఉంది. వాహనదారులు, ప్రజలు, అధికారులు, పోలీసులు, సంబంధిత శాఖ వారు అందరూ దానిని చూసుకుంటూనే వెళ్తున్నారు తప్ప.. ఏ ఒక్కరు దాని గురించి పట్టించుకోవడం లేదు. కాగా, ఆ దారి గుండా వెళ్లే వాహ నదారులు, ప్రజలపై వంగి ఉన్న కమాన్ మొత్తానికి కూలిపోయి పడితే పరిస్థితి ఏంటి అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అసలు దీని గురించి పట్టించుకునే నాధుడే లేడా? అని అడుగుతున్నారు. అధికారులు లేదా రాజకీయ నాయకులు ఎవరో ఒకరు చొరవ చూపి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక అవార్డు

మొదటి పేజీ తరువాయి

ఫర్ సర్క్యులర్ ఎకానమీ ) ప్రత్యేక అందించే ఈ అవార్డును 2025 సంవత్సరానికి గాను ఓయూకు ప్రకటించారు. వనరులను పునర్వినియోగం చేసుకోవటం ద్వారా ఓయూ ఈ అవార్డును కైవసం చేసుకుంది. పునరుత్పాదనలో అభ్యాస పాఠ్యాంశాల రూపకల్పన, అంత ర్గత అధ్యయనాలు, సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పరంగా విశ్వవిద్యాలయం చేపట్టిన వినూత్న ప్రయత్నాలను ప్రత్యేకంగా ప్రశంసించింది.

## కూలిన కూరగాయల బతుకమ్మ..!

మొదటి పేజీ తరువాయి

కూరగాయలన్ని చెల్లాచెదురై పోయాయి. ఉన్న కూరగాయలను సర్దుకుని మంత్రి సీతక్క ముందుకు నడచింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## కేటీఆర్ మిత్రుడు దుబాయ్‌లో చనిపోయాడు?

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లాగా తాము ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేయలేదని, చేయబోమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఏం జరిగిందో వారి కుటుంబసభ్యులే బయటికి వచ్చి చెప్తున్నారని.. తన సొంత ప్రయోజనాల కోసం కాకుండా తెలంగాణ ప్రయోజనాల కోసమే తాను ఢిల్లీకి వెళ్తున్నానని చెప్పుకొచ్చారు రేవంత్. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్ హౌస్ కి వెళ్లాలా? అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు రేవంత్ రెడ్డి. దుబాయ్‌లో మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడు కేదార్ డ్రగ్స్ తీసుకుని చనిపోయాడని సీఎం రేవంత్ అన్నారు. దానికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టును తెలంగాణకు తెప్పించినట్లు తెలిపారు. కేటీఆర్ గంజాయి బ్యాచ్ అని.. అతని చుట్టూ ఉండేవాళ్లు డ్రగ్స్ తీసుకుంటారని ఆరోపించారు. డ్రగ్స్ తీసుకునే కేటీఆర్ తో తానేం మాట్లాడతానని ఎద్దేవా చేశారు. వైట్ ఛాలెంజ్ విసిరితే పారిపోయిన వ్యక్తి కేటీఆర్ అంటూ చురకలు అంటించారు. డ్రగ్స్ పై మాట్లాడకుండా కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుంది కేటీఆర్ కాదా? అని ప్రశ్నించారు. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్‌నుకేటీఆర్ రహస్యంగా ఎందుకు కలిశారు?, అర్ధరాత్రి వేళ లోకేష్‌తో డిన్నర్ మీటింగ్ ఎందుకు చేశారు?.. ఇలా లోకేష్ తో మూడుసార్లు కేటీఆర్ ఎందుకు కలవాల్సి వచ్చింది? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడేందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఎం. మరోవైపు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని తేల్చి చెప్పారు.

## అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**వేద న్యూస్, ఆదిలాబాద్ :**

జల్సాలకు అలవాటు పడి ముఠాగా ఏర్పడి మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యులుగా గల అంతరాష్ట్ర దొంగల ముఠానుఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.బేల మండల కేంద్రానికి చెందిన మోటర్ మెకానికల్ సుమిత్, మరో మైనర్, షకీల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన దాని కృష్ణతో ముఠాను ఏర్పాటు చేశారు. ముఠా సభ్యులు ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో 12 మోటార్ సైకిళ్లను దొంగతనం చేశారని వివరించారు. ఈనెల 17న జైనథ్ లక్ష్మి నారాయణ ఆలయం ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలించారంటూ రమేష్ అనే వ్యక్తి జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జైనథ్ మండలం దీపాయిగూడ ప్రాంతంలో రాత్రి సమయంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆపకుండా పారిపోయారు. వీరిని వెంబడించి పట్టుకుని విచారించగా మోటార్ బైకుల దొంగతనం బయటపడింది. దొంగతనం వాహనాలను కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారులు షేక్ ఇబ్రహీం, అబ్రార్ ఖాన్ తో పాటు మెకానిక్ సాయిలుపై కూడా కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. ముఠా సభ్యుల నుంచి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి




- అవినీతికి కారణమైన మాజీ మేయర్ సునీల్ రావు ఆస్తులపై ఏసీబీ దాడులు చేయాలి.

**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని, మాజీ మేయర్ సునీల్ రావు అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు విచారణచేయాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో కోట్ల రూపాయల నిధులతో జరిగిన స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని దీనిని పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ మేయర్ సునీల్ రావు కొందరు బినామీ కాంట్రాక్టర్లను ఏర్పరచుకొని ఇష్టం వచ్చిన రీతిలో స్మార్ట్ సిటీ పనులలో అవినీతి అక్రమాలు ప్రోత్సహించాడని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఫుట్ పాతుల నిర్మాణం,జంక్షన్ల సుందరీకరణ, పార్కుల నిర్మాణం, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలలో పూర్తిగా అవినీతి అక్రమాలు జరగాయని అధికారులు రాజకీయ నాయకులు ఒక్కటై కరీంనగర్ నగరాన్ని దోచుకున్నారని విమర్శించారు. సంవత్సరం కాకముందే ఫుట్ పాతుల టైల్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు పగళ్ళు వచ్చాయని కాంట్రాక్టర్ పూర్తిగా నాణ్యత పాటించకపోవడం కాంట్రాక్టర్‌కి వత్తాసు పలకడం వల్ల అవినీతి రాజ్యమేలిం దని వెంటనే స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతి పై విచారణ జరిపి కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.మొన్నటి వరకు మేయర్‌గా కొనసాగిన సునీల్ రావు స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని మేయర్ పదవి పోయిన తర్వాత గుర్తుకు రావడం సిగ్గుచేటని సునీల్ రావు మాటలు వింటుంటే దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరించడం సరైంది కాదనిఆరోపించారు.సునీల్ రావుకు కరీంనగర్ నగరంలో బహుళ అంతస్తుల భవనం, విదేశాల్లో భవంతులుఏ విధంగా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. సునీల్ రావుకు చిత్తశుద్ధి ఉంటే తను కౌన్సిలర్‌గా పోటీ చేసిన సమ యంలో ఎన్నికల అఫిడవిట్లో పెట్టిన ఆస్తుల వివరాలు ఇప్పుడు తన ఆస్తుల వివరాలు ప్రజలకు వివరించి తన చిత్త శుద్ధి నిరూపించుకోవాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతి, సునీల్ రావు అక్రమాలపై విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సురేందర్ రెడ్డి హెచ్చరిం చారు.ఈ ధర్నాలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టి అంజలి, మచ్చ రమేష్, ఆర్ వెంకటేష్ నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం,కె. సంతోష్ చారి, చంచల మురళి, నగునూరి రమేష్, ఎలిశెట్టి భారతి, చారి, రాము, సాంబరాజు, బెక్కంటి రమేష్, లక్ష్మి,రజిత, తదితరులు పాల్గొన్నారు

## దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు..?

**వేద న్యూస్, హైదరాబాద్ :**



చిట్‌చాట్ పేరుతో రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు, ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో నాపైన, ఇతరులపైన విషయం చిమ్మడం ఇదే మొదటిసారి కాదు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటివరకు సంయమనం పాటించాను అని కేటీఆర్ తెలిపారు. డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకి ఆధారం ఏమిటో చెప్పాలి. నాపైన ఏమైనా కేసు నమోదైందా? కనీసం అణువంత రుజువైనా ఉన్నదా? ముఖ్యమంత్రికి దమ్ముంటే దొంగ చాటుగా చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసురుతున్నాను. లేకుంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఒప్పుకోవాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ములేక ఢిల్లీ వరకు ప్రయాణం చేసి మరీ రేవంత్ రెడ్డి నాపై బురద జల్లుతున్నాడు. కేవలం చట్టం పరిధి నుంచి న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నాడు. పిరికి దద్దమ్మలా చిట్‌చాట్‌ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడు. వీటన్నింటినీ ఇకపై సహించేది లేదు.. రేవంత్ రెడ్డి చేసిన అసత్యపూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రేవంత్ తాను చేసిన నిరాధార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే పర్యావసనాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని కేటీఆర్ హెచ్చరించారు.

## రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజం..

**వేద న్యూస్, కరీంనగర్**



గల్ఫ్ కార్మికుల విషయంలో మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి గల్ఫ్ సంక్షేమ బోర్డ్ ఏర్పాటు, ఎన్ఆర్ఐ సంక్షేమ బోర్డ్ ఏర్పాటు, గల్ఫ్ కార్మికుల టోల్ ఫ్రీ నెంబర్ లాంటి హామీలు ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు అని ప్రభుత్వాన్ని అడిగాను. గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తామని చెప్పి కొందరికి ఇచ్చారు ఇంకా నియోజకవర్గంలో రానివారు ఉన్నారు వారికి ఇవ్వాలని ప్రభుత్వంను అడగటం జరిగింది. ఒక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజల పక్షాన అడగటం నా బాధ్యత.. ఇందులో తప్పేముంది? అని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు.దీనికి బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మానాల మొహన్ రెడ్డి మా ఇంటి మీదికి వస్తా అని సవాల్ విసిరాడు. ఇవాళ మా ఇంటి మీదకి కొందరు కాంగ్రెస్ నాయకులు వచ్చి దాడి చేశారు. మానాల మొహన్ రెడ్డి కడుపు సల్లబడిందా? మానాల మోహన్ రెడ్డి మీ ఐడేంటిటి కోసం నా ఇంటి మీదికి దాడికి వస్తే ప్రజలకి జరిగే లాభం ఏంటి.. ఒరిగింది ఏంటి? గత 10 ఏండ్లలో మా కేసీఆర్‌ను, మమ్మల్ని ఇదే మానాల మొహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనరాని మాటలు అన్నారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నాపై వ్యక్తిగతంగా అనేక మాటలు మాట్లాడినాడు. మేము మీరు చేసినట్టు ఇంటి మీదకి పోయినామా..? ఇది సభ్యతనా..? రాజకీయాల్లో ఇది మంచిదా..? బాల్కొండ ప్రజలు ఆలోచించండి అని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.మానాల మోహన్ రెడ్డి మీకు ఒక సూచన చేస్తున్న.. మీరు మా ఇంటిపై దాడికి రావడమో లేదా మా వాళ్ళు మీ ఇంటికి రావడమో, రాజకీయ సన్యాసము తీసుకోవడమో లాంటివి టైం పాస్ డ్రామా కార్యక్రమాలు తప్ప దీనివల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు. అధికార పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రజలకు కావాలి. ఒకవేళ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చపోతే ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీసే హక్కు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా నా బాధ్యత. ఇది నాకు ప్రజలు ఇచ్చిన హక్కు. నేను గల్ఫ్ కార్మికుల పక్షాన వారి హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే అభినందించాల్సింది పోయి దేవేందర్ రెడ్డి వారి అనుచరులతో అక్రమంగా మా ఇంట్లో చొరబడి దాడి చేయడం న్యాయమా..? అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073